# సింగిల్ పేజీ కథలు

"నాకిపుడు టైం బాగోలేదు. ఒకప్పుడు నేను మట్టి పట్టుకుంటే బంగారమయ్యేది. కానీ ఇప్పుడు బంగారాన్ని పట్టుకుంటే మట్టి ఐపోతోంది. ప్లాటినం పట్టుకుంటే పొట్టు ఐపోతోంది. నా మాట విను. నా టైం బాగయ్యేదాకా నేనేం చేసినా అది చెడుకే దారి తీస్తుంది" అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు ధర్మారావు. కానీ కూర్మారావు అతన్ని పూర్తిగా చెప్పనివ్వలేదు. "ట్రాష్." అంటూ మధ్యలోనే అడ్డుపడి అతని మాటల్ని కొట్టిపారేశాడు.

"నేనిలాంటివన్నీ నమ్మను. మనలో సంకల్పబలం వుండాలేగానీ, చిత్తశుద్ధితో కృషి చెయ్యాలేగానీ, ఎలాంటి టైంలోనైనా, ఎలాంటి బిజినెస్ అయినా చేపట్టి దాన్ని విజయపథంలో ముందుకు తీసుకుపోవచ్చు. అంతే తప్ప, ఇలాంటి కుశంకలు పెట్టుకుంటే జీవితంలో మనమేమీ సాధించలేం."

"అంతేనంటావా?"

"ముమ్మాటికీ అంతే. నేను టైటిల్‌కి ఎప్పుడో అప్లయ్ చేసేశాను. రేపో మాపో వచ్చేస్తుంది కూడా!" అన్నాడు కూర్మారావు.

అతని ఉత్సాహంపై చన్నీళ్ళు చిలకరించడం ఇష్టం లేక, "అలాగా! ఇంతకీ ఏంటా టైటిలు?" అని అడిగాడు ధర్మారావు.

"దురద" చెప్పాడు కూర్మారావు.


"దురదా?!" అన్నాడు ధర్మారావు. "ఛీ! అదేం టైటిల్? అంతకన్నా మంచి పేరు నీకింకేం దొరకలేదా?" అంటూ ఆముదం తాగినవాడిలా ముఖం పెట్టాడు.

"అలా తీసిపారేయకు. బాగా ఆలోచించి పెట్టానీ టైటిలు. ప్రస్తుతం మన ప్రజానీకం ఏ విషయంలోనైనా వెరైటీని ఆదరిస్తున్నారు. పేరే ఇంత వెరైటీగా వుంటే, ఇక లోపలేం వుంటుందో చూద్దామన్న ఆసక్తి ఆటోమాటిగ్గా కలిగి తీరుతుంది. దాంతో మన పత్రిక సంవత్సరం తిరిగేసరికి లక్ష కాపీలు దాటిపోతుంది. రచయితగా పాతికేళ్ల అనుభవం వున్న నువ్వు ఎడిటర్‌గా బాధ్యతలు చేపట్టి, పాఠకులు కోరుకునే సరుకంతా పత్రికలో వుండేలా చూశావనుకో- ఆ లక్ష కాపీలు కాక మరో లక్ష పెరుగుతుంది. అది చాలదా మన 'దురద' పత్రిక సక్సెస్ కావడానికి? కాబట్టి నువ్వు ఇంకేం సందేహించొద్దు. నా టైం బగుందికాబట్టే నాకిలాంటి వెరైటీ ఆలోచన వచ్చింది. నువ్వు నా ఫ్రెండువి కాబట్టి నీకీ అవకాశం ఇస్తున్నాను. రేపే వచ్చి ఎడిటర్ సీట్లో కూర్చుండిపో" అన్నాడు కూర్మారావు.

చేతిలో నాలుగు డబ్బులు వున్నవాడిలో, పత్రిక పెట్టాలనే దురద గనక మొదలైతే- వెంటనే ఏదోక పత్రిక ప్రారంభించేసి, మూడునెలలు తిరక్కముందే మూసెయ్యడం సాధారణంగా జరిగే పనే! అందులో వింతేమీ లేదు. కానీ కూర్మారావు, పత్రిక పెట్టాలని తనలో కలిగిన దురదకి 'దురద' అని నామకరణం చెయ్యడం- అదే కాస్త చిత్రంగా అనిపించింది ధర్మారావుకి.

## అంతా మన మంచికే

'ఎన్ని కథలు రాసినా, నవలలు రాసినా రచయితని రచయితే అంటారు. కానీ అదే ఎడిటరైతే- అబ్బో.. ఎంత గొప్ప?' అనుకోగానే అర్జంటుగా ఎడిటరైపోవాలన్న దురద ధర్మారావులోనూ ఏర్పడిపోయింది. వెంటనే అతనెళ్లి




'దురద' వారపత్రిక సీట్లో కూర్చుండిపోయాడు. వారం తిరక్కముందే, అత్యధిక సర్క్యులేషన్ గల ఒక దినపత్రికలో వాళ్ల 'దురద' వారపత్రిక ప్రకటన అచ్చేయించారు.

'తెలుగు పాఠకులకు కందిభొట్ల కూర్మారావు కూరిమితో అందిస్తున్న ప్రేమకానుక 'దురద' సపరి వారపత్రిక. ఎడిటర్- దాచేపల్లి ధర్మారావు. మా 'దురద'ని రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేయడానికి సమర్థులైన, డిపాజిట్ కట్టగలిగిన ఏజెంట్లు కావలెను. ఏజెన్సీ వివరాలకు వెంటనే ఈ క్రింది చిరునామాకు వ్రాయండి.'

ఆ ప్రకటన చూసి కూర్మారావు, ధర్మారావు మురిసిపోయారు.

"యాడ్ ఎక్సలెంట్‌గా వచ్చింది. ఏజెన్సీ మాక్కావాలంటే మాక్కావాలంటూ ఏజెంట్లు మనమీద డిపాజిట్లతో విరుచుకుపడతారు" అన్నాడు కూర్మారావు. వంత పాడాడు ధర్మారావు.

కానీ వాళ్లూహించినట్టు ఏజెంట్లు వాళ్లమీద విరుచుకుపడలేదు. దాంతో వాళ్లు ఆలోచనలో పడి, రెండురోజుల తర్వాత మరో ఆఫ్ పేజీ ప్రకటన ఇచ్చారు అదే పేపర్లో. అయినా ఏజెంట్లు విరుచుకుపడలేదు. కానీ రైటర్స్ మాత్రం తమ రచనాజాలాలతో విరుచుకుపడ్డారు పత్రికా కార్యాలయం మీద.

తమ 'దురద' రైటర్స్‌లో సంచలనం రేపినందుకు సంయుక్తంగా మురిసిపోయారు కూర్మారావు, ధర్మారావు.

"ముందుగా మనక్కావాల్సింది ఏజెన్సీలు, డిపాజిట్లూ. మరో ఫుల్‌పేజీ ప్రకటన ఇద్దాం" అన్నాడు ధర్మారావు. సరేనన్నాడు కూర్మారావు. మరో ఫుల్‌పేజీ ప్రకటన వచ్చింది. కానీ ఏజెంట్లు ఆ ప్రకటన కూడా పట్టించుకోలేదు. మరో ప్రకటన ఇద్దామన్నా వాళ్లదగ్గర డబ్బుల్లేవు.

"ఇక ప్రకటనలతో పనిగాదు. మనమే ఊరూరూ తిరిగి డిపాజిట్లు సేకరిద్దాం" అన్నాడు కూర్మారావు.

ఆ మర్నాడే వాళ్లిద్దరూ కలసి ఆల్ ఆంధ్రా టూర్ ప్రారంభించారు. ఏ ఊరుకెళ్లి, ఏ ఏజెంట్‌ని కదిపినా "మీ 'దురద'ని ముందు బైటికి రానివ్వండి. ప్రారంభ సంచిక చూశాక, పత్రిక బాగుంటే డిపాజిట్ల సంగతి అప్పుడు ఆలోచిద్దాం" అన్నవాళ్లే తప్ప, ఒక్కరంటే ఒక్కరు కూడా డిపాజిట్ కట్టిన పాపాన పోలేదు. అలా నిరాశ నిండిన గుండెలతో తమ టూరు ముగించుకుని హెడ్‌క్వార్టర్స్‌కి చేరుకున్నారు 'రావు'లిద్దరూ.

"లాభం లేదు గురువా! ప్రారంభ సంచిక రిలీజ్ చేస్తే తప్ప, ఏజెంట్లు దారికొచ్చేలా లేరు" అన్నాడు ధర్మారావు.

"నిజమే! కానీ అది రిలీజ్ చెయ్యడానికి డబ్బులెక్కడివి? ఉన్నదంతా ప్రకటనలకే ఖర్చయిపోయిందిగా" అన్నాడు కూర్మారావు.

"కింకర్తవ్యం?" అడిగాడు ధర్మారావు.

"ఏముంది? డబ్బు పోయినా పత్రిక పెట్టాలనే 'దురద' తీరిందని సంతోషించడమే! మన ప్రకటనల వల్ల దురద పబ్లిషర్‌గా నాకూ, దురద ఎడిటర్‌గా నీకూ బాగానే పేరొచ్చిందిగా!" చెప్పాడు కూర్మారావు.

**- కోలపల్లి ఈశ్వర్ (నెల్లూరు)**